# అటవీ భూమి అన్యాక్రాంతం

- కోనరావుపేటలో హరితహారం మొక్కలు ధ్వంసం
- చదును చేసి అక్రమించిన గుర్తుతెలియని వ్యక్తులు



కోనరావుపేటలో ట్రాక్టర్‌తో చదును చేసిన భూమి

కోనరావుపేట, జూలై 14: అటవీ భూములు రోజురోజుకూ ఆక్రమణకు గురవుతున్నాయి. గత ప్రభుత్వం అటవీ భూములను రక్షిస్తూ చుట్టు కంచెలు ఏర్పాటు చేసింది. ఖాళీగా స్థలాల్లో హరితహారం కింద మొక్కలు నాటించింది. విత్తన బంతులు తయారు చేసి, డ్రోన్ల ద్వారా చల్లించింది. ఇలా అనేక రకాలుగా అటవీ సంరక్షణకు చర్యలు తీసుకున్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఏడు నెలలు గడవకముందే కబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండల కేంద్రంలో హరితహారం నర్సరీ ముందు ఉన్న అటవీ భూమిలో గత ప్రభుత్వం సుమారు ఐదు వేలకు పైగా హరితహారం మొక్కలు నాటించింది. మొక్కలు ఎదుగుతున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల రాత్రి సమయాన ట్రాక్టర్లతో మొక్కలను ధ్వంసం చేశారు. అంతేకాకుండా మొక్కలు కనిపించకుండా వాటిపై మట్టిని పోశారు. పెద్ద వృక్షాలను నరికివేశారు. ఇలా ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై డీఆర్వో (డిస్ట్రిక్ రేంజ్ ఆఫీసర్) బాపురాజును వివరణ కోరగా, హరితహారం మొక్కలను ధ్వంసం చేసి, భూమిని చదును చేసిన వారిని గుర్తిస్తామన్నారు. బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపలి, జూలై 14: మండలంలోని కోరెం సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ కారణంగా బూరుగుపల్లి, కొరెం, దుంద్రపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జీ ప్రశాంత్ తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.


**PUBLIC NOTICE**

The General Public do hereby informed that my client **Mr. KEVAL CHAND B DEVASI , S/o. B V Devasi**, aged about 43 years, R/o. Plot No 8, Shivarampally village, Rajendranagar, Ranga Reddy Dist, 500052, T.G., Occupations: Business. They has entered into an agreement of sale for H.No.13-29, admeasuring 50 Sq Yards, or 41.80 Sq Meters., (Ground Floor Plinth Area 450 Sq.fts, 1st floor plinth area 450 Sq.fts) Situated at "KAMAREDDY MAIN ROAD" of Gollapally Village, Yellareddypet Mandal, Rajanna Sircilla Dist, T.G..and bounded as follows: North:House of Vangala RAvender, South: House of Jangamma Lingam, East : Open Place of Chidura Srinivas, West: 40'-0" Wide Road (Gollapally Ambedker Statue to Bopparam Village Road., from Mr. Thumma Sainithin, S/o. T Shekar, R/o. H.No. 11-63/10/1, Repallevada, Dubbaka Proper & Mandal, Siddipet Dist, T.G. State., through vide Sale Deed Document No.1617/2024, on dt: 22/02/2024, Regd at SRO. Sircilla, T.G., and my clients has paid earnest substantial amount to the Vendor as an advance.

Therefore any person(s) having any claim/s, objects, interest/s, whatever in respect of scheduled property or part thereof by way of exchange, mortgage, charge, gift, maintenance, inheritance, possession, lease, tenancy, sub tenancy, lien, hypothecation, transfer of title or beneficial interest under any trust right of prescription under any decree claiming, are hereby requested to make the same known in writing with supporting documents to the undersigned within in a period of (7) days of the publication, otherwise the sale transaction will be completed, thereafter no claims should be entertained.

Sd/- **K. Narendhar Kumar,** Advocate
H.No. 6-1-95, Shivarampally (V),
Rajendranagar (M), Post: SVP NPA,
Hyderabad-500062, Cell: 9440970004



నమస్తే తెలంగాణ CLASSIFIED

**TOURS & TRAVELS**



★ మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.

NT-339536

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571


# కార్మికుల సమావేశాన్ని జయప్రదం చేయండి

- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్




సమావేశంలో మాట్లాడుతున్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

కలెక్టరేట్, జూలై 14 : సిరిసిల్లలో సోమవారం జరిగే పవర్‌లూం కార్మికుల సమావేశాన్ని జయప్రదం చేయాలని పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ కోరారు. ఈ మేరకు ఆదివారం సిరిసిల్ల బీవై నగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవన్ సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నేడు చేనేత జౌళిశాఖ పక్కన గల సీఐటీ యూ కార్యాలయం వద్ద పవర్లూమ్ కార్మికుల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో పవర్‌లూం కార్మికుల ఉపాధి కోసం భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించుకుందామని తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో పని చేస్తున్న పవర్‌లూం కార్మికులందరూ ఉదయం 10 గంటల వరకు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత ఎనిమిది నెలల నుంచి పనిలేక కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటికే 10 మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇప్పుడు పరిస్థితి ఇంకా తీవ్రమైందని సమస్య పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. కేంద్రమంత్రి, నియోజకవర్గ ఎంపీ బండి సంజయ్ ఆరు సంవత్సరాల నుంచి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారే తప్ప ఏనాడూ కూడా పవరూర్‌లూం కార్మికుల సమస్యల గురించి గానీ, వస్త్ర పరిశ్రమ సమస్యల గురించి గాని పట్టించుకోదని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆయన చేసిందల్లా ఒక్కటే పత్రికా ప్రకటనల ద్వారా బీఆర్ఎస్ పార్టీని విమర్శించడమే తప్ప ఆయన సిరిసిల్లకు చేసిందేమీ లేదన్నారు. నిజంగా కార్మికులపై ప్రేమ ఉంటే వెంటనే ప్రధాన మంత్రితో మాట్లాడి కేంద్ర ప్రభుత్వానికి అవసరమైన వస్త్రాల ఆర్డర్లను వెంటనే తీసుకువచ్చి సిరిసిల్ల కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. వర్క్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని, మెగా టెక్స్‌టైల్ పార్కును సిరిసిల్లలో ఏర్పాటు చేయించి చిత్తశుద్ధిని చాటుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు నాలుగు రోజుల్లో వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్త పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఉపాధ్యక్షుడు నక్క దేవదాస్, జిల్లా నాయకులు బెజిగం సురేశ్, గడ్డం రాజశేఖర్, బింగి సంపత్, బింగి సతీశ్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వేములవాడ ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మిక సంఘం నాయకులు

వేములవాడ, జూలై14: గ్రామ పంచాయతీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కార్మిక సంఘం నాయకులు ఆదివారం కలిసి వినతి పత్రం అందజేసి కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ దుంద్రపల్లి రవీందర్ మాట్లాడుతూ,జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వడమే కాకుండా పర్మనెంట్ చేయాలని ఆయన కోరారు. పాత కేటగిరీల ప్రకారం కార్మికులతో పనులు చేయించి కారోబార్లను అసిస్టెంట్ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ప్రతి కార్మికుడికి బీమా, ఆరోగ్య బీమాను కల్పించి ఆదుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు దేవయ్య, నాగరాజు, గున్నయ్య, ఎల్లయ్య, రమేశ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన సబ్ స్టేషన్లను మంజూరు చేయండి

- ఉపముఖ్యమంత్రిని కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ/రుద్రంగి/చందుర్తి, జూలై 14: వేములవాడ నియోజకవర్గంలో నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రిని కలిసి వేములవాడ రూరల్ మండలం రుద్రవరం, నూకలమర్రిలో 33/11 కేవీ, రుద్రంగి మండల కేంద్రంలో 33/11కేసీ, చందుర్తి మండలం జోగాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 132/11 కేవీ, నేరెళ్లలోని 33/11కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లోవోల్టేజీ, ఓవర్‌లోడ్ కారణంగా రైతులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

## వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, జూలై 14 : మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేనివారికి జరిమానా విధించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకు వెళ్సాల్సి వస్తుందని అందరికీ అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సంక్షేమ వసతి గృహ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

చందుర్తి, జూలై 14: సంక్షేమ వసతి గృహ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చందుర్తి సంక్షేమ వసతి గృహాధికారి రవీంద్ర స్వామి అన్నారు. ఆదివారం సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు చికెన్ బిర్యానీ అందజేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం సాయంత్రం టీ, స్నాక్స్ అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 14: గంంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన తుడుం శ్రీకాంత్ మరణానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ అట్రాసిటీస్ ప్రివెన్షన్ పోర్స్ స్టేట్ ప్రెసిడెంట్ బత్తుల రాంప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం లింగన్నపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న సమాచారం తెలుసుకున్న ఎల్లారెడ్డిపేట పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీకాంత్‌ను ప్రేమ పేరుతో యువతి మోసం చేయడమేగాక శ్రీకాంత్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



నిమ్మపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న చేపూరి గంగాధర్, నేతలు

కోనరావుపేట, జూలై 14: మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో చిలుక రవీనకు రూ.16500, మర్యాల శేఖర్‌కు రూ.14 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ చెక్కులతో ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని తెలిపారు. ఇక్కడ లైవ్ జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, నేతలు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం

మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామం వద్ద ఎస్సారెస్పీ కాలువపై గల వంతెనకు ప్రమాదం పొంచి ఉంది. పిల్లర్లపై రావిచెట్లు పెరిగి పగుళ్లు వస్తున్నాయి. ఎస్సారెస్పీ కాకతీయ కాలువ నిర్మించిన సమయంలోనే వెల్లుల్ల వద్ద నీటిని ఆపేలా ఐదు తలుపులతో వంతెనను నిర్మించారు. నిత్యం ఆత్మకూర్, ఆత్మనగర్, రామలచ్చక్కపేట, జగ్గసాగర్, రంగారావుపేట, మెట్లచిట్టాపూర్, విట్టంపేట, నిజామాబాద్ జిల్లా భీంగల్, చౌట్‌పల్లి గ్రామాల నుంచి వెల్లుల్ల వంతెన మీదుగానే మెట్‌పల్లికి వేలాది వాహనాలు వెళ్తుంటాయి. అయితే, బండరాళ్లతో నిర్మించిన పిల్లర్లలో కొన్నేళ్ల నుంచి రావి చెట్లు పెరుగుతున్నాయి. దీంతో వంతెన పగుళ్లు వచ్చి దెబ్బతింటున్నది. సంబంధిత అధికారులు స్పందించి రావి చెట్లను తొలగించి వంతెన దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. **-మెట్‌పల్లి రూరల్, జూలై 14**



వంతెన పిల్లర్లపై పెరుగుతున్న రావిచెట్లు

# బద్దిపోచమ్మకు ఘనంగా ఆషాఢ బోనాలు



వేములవాడ టౌన్ : బోనాలతో వెళ్తున్న రాంమందిరం వీధిలోని మహిళలు

వేములవాడ టౌన్, జూలై 14: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం వేములవాడ పట్టణంలోని వివిధ కుల సంఘాలకు చెందిన మహిళలు బద్దిపోచమ్మ అమ్మవారికి ఘనంగా బోనా లు సమర్పించారు. పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన పద్మశాలీ కులానికి చెందిన మహిళలు, రాంమందిరం వీధిలోని కుల బాంధవులు, మోచీ సంఘానికి చెందిన మహిళలు, మార్కండేయనగర్‌కు చెందిన భావనరుషి సమాజ సేవా సంఘం, పద్మశాలీ మహిళల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయానికి తరలి వెళ్లి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మ్యాన రాజ య్య,శ్రీనివాస్, సంతోష్, బూర సదానందం, దూస రాజేందర్, దూడం లక్ష్మణ్, బైరి నాగరాజు, మ్యాన రాజేశ్, పెండెం లక్ష్మణ్, మోచీ సంఘం అధ్యక్షుడు కొండ్లెపు ముత్యం, వౌటారికారి బాలయ్య, చిన్న బాలయ్య, కావల్ల సత్యం, గోపి, ప్రసాద్, జలందర్, శ్రీధర్,శ్రీను,లక్ష్మీరాజం పాల్గొన్నారు.

### కార్పెంటర్స్ సొసైటీ ఆధ్వర్యంలో..

వేములవాడ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర కార్పెంటర్స్ సొసైటీ వేములవాడ సంఘం అధ్యక్షుడు బోగోజీ ఆంజనేయు లు చారి ఆధ్వర్యంలో మహిళలు బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆలయానికి డప్పుడప్పుళ్లమధ్య నెత్తిన బోనంతో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సనుగుల సత్యంచారి, రూరల్ మండలాధ్యక్షుడు చందనం రవీందర్ చారి, స్థంభంపల్లి శ్రీధర్‌చారి, ఆంజనేయ చారి, దర్శనాల రాములు, శ్రీనివాస్, దుర్గయ్య, రామలింగం, రాజు, శంకరయ్య, వీరాచారి, తిరుపతి, వెంకటస్వామి, వెంకటాచారి, నాగభూషణం, రాజు, సత్తయ్య, రమేశ్, సతీశ్, రవి, కరుణాకర్, నాయకులున్నారు.

### రుద్రవరంలో..

వేములవాడ రూరల్, జూలై 14: వేములవాడ మండలం రుద్రవరంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఇక్కడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కాసర్ల అరుణ్, ఉపాధ్యక్షుడు మొగులోజి నర్సయ్య, క్యాషియర్ కాసర్ల రాజేశ్, మెడిచెలిమెల శ్రీనివాస్, రాజశేఖర్, అంజయ్య, కొండయ్య, రాజు మహిళలున్నారు.



వేములవాడ టౌన్ : బోనాల ఉత్సవంలో కార్పెంటర్స్ సొసైటీ నాయకులు,సభ్యులు



వేములవాడ రూరల్: రుద్రవరంలో పోచమ్మ బోనాలో పాల్గొన్న మహిళలు

## రాజన్న సేవలో ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ దంపతులు

వేములవాడ టౌన్, జూలై 14 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని ఆదివారం ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఎం.వెంకటేశ్వర్‌రావు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వారికి స్వామి వారి శేషవస్త్రం కప్పి ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాప నవీన్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్, ఈవో సీసీ ఎడ్ల శివసాయి తదితరులున్నారు.

## క్రీడలతో మానసికోలాసం



వివిధ పార్టీల నాయకులతో కలిసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఈర్లపల్లి రాజు

చందుర్తి, జూలై 14: ఆటలు ఒత్తిడిని తగ్గించి మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఈర్లపల్లి రాజు అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం యువ నాయకులు మ్యాకల పరశురాములు క్రీడాకారులకు పండ్లను పంపిణీ చేశారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు చిలుక అంజిబాబు, బాణాల రవీందర్ రెడ్డి, మ్యాకల గణేశ్, ధర్మపురి శ్రీనివాస్, క్రీడాకారులున్నారు.

## దంత వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా దంత వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్
- నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సోమారపు సతీశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యులు

సిరిసిల్ల రూరల్, జూలై 14: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని దంత వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా దంత వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సోమారపు సతీశ్‌కుమార్ అన్నారు. ఈమేరకు ఆదివారం సిరిసిల్లలోని ప్రైవేటు వసతి గృహంలో ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజు, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ శివ సంతోష్, డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ కే రాజేందర్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఇక్కడ దంత వైద్యులు జ్యోతి, స్నేహ, జవాలి రెడ్డి, సుష్మిత, ఆకాంక్ష, ప్రియాంక సుమారు 70 మందికిపైగా వైద్యులున్నారు.

## గుండ్లపల్లి వాసికి భారతీయ నారీ శక్తి అవార్డు ప్రదానం

తెలంగాణచౌక్, జూలై 14: గన్నేరువరం మండలం గుండ్లపల్లికి చెందిన ప్రముఖ గాయకురాలు మంగళ కృష్ణవేణి అంతర్జాతీయ భారతీయ నారీ శక్తి అవార్డు అందుకున్నారు. స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ పీస్ ఆఫ్ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, ఆసియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంగళ కృష్ణవేణి మాట్లాడుతూ, ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

## 'గ్రెయిన్ చైన్స్' పుస్తకావిష్కరణ

కమాన్ చౌరస్తా, జూలై 14: నగరంలోని ఫిలింభవన్‌లో సాహితీ సోపతి, ఎస్సీ ఫ్రెండ్స్, కఫిసా సంయుక్త ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కవి అన్నవరం దేవేందర్ తెలుగులో రాసిన వరిగొలుసులు పుస్తకాన్ని 'గ్రెయిన్ చైన్స్' పేరిట సవ్యసాచి ఆంగ్లంలోకి అనువదించగా, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్‌కు అంకితమిచ్చి సన్మానించారు. కార్యక్రమంలో అనువాదకుడు, విద్యాదేవ విశెట్టి శంకర్, గాజోజు నాగభూషణం, నంది శ్రీనివాస్, రావుల శశిధర్, వేముల సత్యనారాయణ మాట్లాడారు. ఆంగ్ల కవి జీ పరశురామారావు పుస్తక పరిచయం చేశారు. అష్టాదశ శక్తి పీఠాల ప్రాభవంపై డాక్టర్ కృష్ణసాహితి చేసిన నృత్యం ఎంతగానో ఆకట్టుకున్నది. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. ఇక్కడ సమన్వయ కర్తలు సీవీ కుమార్‌లున్నారు.

## హామీల అమలుకు ప్రభుత్వాలపై పోరాటం

చిగురుమామిడి, జూలై 14: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేసే సమయం ఆసన్నమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లంబాడి పల్లి గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు కయ్యం వీరయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నెరవేర్చాలన్నారు. పార్టీ బలోపేతం కోసం గ్రామ కమిటీల సమావేశం నిర్వహించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కార్యకర్తలను సన్నద్ధం చేస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి, మాజీ సర్పంచ్ నాగేల్లి వకుళా దేవి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ముద్రకోల రాజయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీపీఐ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా కయ్యం తిరుపతి, సహాయ కార్యదర్శిగా అనుమాసుల మల్లారెడ్డి, కోశాధికారిగా చందబోయిన కనకయ్య, ఏఐఎస్ఎఫ్ బాధ్యుడిగా పచ్చిమట్ల రాము, ఏఐవైఎఫ్ బాధ్యుడిగా వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యుడిగా చందబోయిన ఎల్లయ్య, రైతు సంఘం బాధ్యుడిగా కోతి కనకయ్య, మహిళా సమాఖ్య బాధ్యులుగా కయ్యం సుజాత, నాగెల్లి కళావతిని ఎన్నుకున్నట్లు మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి తెలిపారు.

## హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

తెలంగాణచౌక్, జూలై 14: జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలి పేదలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో కనీస వైద్యసదుపాయాలు లేవని ఆరోపించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, జాండీస్ తదితర వ్యాధులు ప్రబలి, దాదాపు ప్రతి కుటుంబంలో జ్వర పీడితులు ఉన్నారని తెలిపారు. వారికి వైద్య సేవలందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సదుపాయాలు లేకపోవడంతో పేదలు ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ హాస్పిటళ్ల యాజమాన్యాలు రక్త పరీక్షలు, స్కానింగ్ లాంటి టెస్టులతో డబ్బులను దండుకుంటున్నాయని ఆరోపించారు. వెంటనే ప్రతి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటళ్లలో ఇష్టారీతిగా అబార్షన్లు చేస్తున్న డాక్టర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.